రోడ్డు విస్తరణలో జాప్యం

- నిధులు మంజూరైనా ప్రారంభంకాని మార్కెట్‌రోడ్డు పనులు
- గుంతలమయంగా మారిన రోడ్డుతో వాహనదారుల అవస్థలు
- అలసత్వం వహిస్తున్న అధికారులు

నకిరేకల్ : పట్టణ కేంద్రం నుంచి మార్కెట్‌యార్డు మీదుగా కడపర్తి రోడ్డు వరకు వెళ్లే రహదారి గుంతల మయంగా మారి వాహనదారులు ప్రయాణాలు సాగించాలంటే అసవస్థలు పడుతున్నారు. అందుకు స్పందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు విస్తరణకు రూ.10కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఈ పనులకు సంబంధించి గత మార్చి నెలలో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి 5నెలలు కావస్తున్నా నేటికీ పనులు ప్రారంభంకావడంలో జాప్యం జరుగుతోంది. ఇప్పటికే రోడ్డు ఇరుకుగా ఉండడం ఆపై అంతా గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు మండలాలు, రెండు నియోజకవర్గాలను కలిపే ఈ రహదారిలో ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు హడలెత్తిపోతున్నారు.



గుంతలమయంగా మారిన నకిరేకల్‌లోని మార్కెట్‌రోడ్డు

అంతా గుంతలమయం..

గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈరోడ్డు అంతా గుంతలమయంగా మారడంతో ఈరోడ్డు గుండా ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. నకిరేకల్ నుంచి తుంగతుర్తి నియోజకవర్గంలోని శాలిగౌరారం మండలానికి వెళ్లే ఈ ప్రధాన రహదారిలో 20గ్రామాలకు చెందిన దాదాపు 10వేల మంది నకిరేకల్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. 200దాకా ఆటోలు, ద్విచక్రవాహనాలు, అదే విధంగా బస్సులు నిరంతరం ప్రయాణాలు సాగిస్తుంటాయి. నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం మూలమలుపు నుంచి శాలిగౌరారం మండలానికి వెళ్లే ప్రధాన రహదారి వరకు గుంతలమయంగా మారింది. ప్రధానంగా పన్నాలగూడెం నుంచి నకిరేకల్ శివారులోని సిరాంచ బైపాస్ వరకు ఉన్న మూడు కిలోమీటర్ల మేర ప్రధాన రహదారి ఇరుకుగా ఉండటంతో పాటు రోడ్డు వర్షానికి పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డులో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించడంలో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ఘటనలు కూడా ఉన్నాయి. నిత్యం ఈదారి గుండా శాలిగౌరారం, మోత్కూర్, అడ్డగూడూరు, నార్కట్‌పల్లి మండలాల వైపు ఆర్టీసీ బస్సులు, ఇతర ఆటోలు, వాహనదారులు కూడా నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు.



రోడ్డు విస్తరణకు వేసిన శిలాఫలకం

పనులు వెంటనే ప్రారంభించాలి



పట్టణం నుంచి మూడు కిలోమీటర్ల మేర రహదారి గుంతలమయంగా మారడంతో ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రత్యేక చొరవ చూపి రూ.10కోట్ల నిధులు మంజూరు చేయించారు. కాని పనులు మాత్రం ఇంకా ప్రారంభించలేదు. వెంటనే పనులు ప్రారంభించి సమస్యకు పరిష్కారం చూపాలి.

– పైళ్ల శశిధర్‌రెడ్డి, శివాంజనేయ ఆలయ చైర్మన్, నకిరేకల్

త్వరలో పనులు ప్రారంభిస్తాం

రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే చేపడతాం. ఈరోడ్డు విస్తరణ మార్గంలో విద్యుత్ స్తంభాలను మార్చాల్సి ఉంది. దీంతో పాటు మిషన్ భగీరథ పైపు లైన్ రోడ్డు వెంట ఉండడంతో ఇబ్బందిగా మారుతుంది. ఈ రెండు లైన్లను మార్పు చేసుకోవాలని సంబంధిత అధికారులకు ప్రతిపాదించాం. వారు ఇంకా ఎలాంటి పనులు చేపట్టడంలేదు. ఈరెండు పనుల వల్లనే రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతుంది.

– సంతోష్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, నకిరేకల్

క్లుప్తంగా

వినియోగదారుల హక్కుల కమిషన్ చైర్మన్‌గా అంజయ్య



అంజయ్యకు నియామక పత్రం అందజేస్తున్న నాగేశ్వర్‌రావు

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన బొడిగె అంజయ్యగౌడ్ నేషనల్ జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ నల్లగొండ జిల్లా చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ కమిషన్ నేషనల్ చైర్మన్ ఎంపీఎల్ నాగేశ్వర్‌రావు, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ నల్లమాస శ్రీకాంత్ శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అంజయ్యకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అంజయ్యగౌడ్ మాట్లాడుతూ.. జిల్లాలోని వినియోగదారులకు ఎలాంటి అన్యాయం, ఇబ్బందులు కలుగకుండా తగిన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వినియోగదారులు మోసపోతే కన్జ్యూమర్స్ ప్రొటెక్షన్ రైట్స్ యాక్ట్‌ను వినియోగించుకొని న్యాయం పొందాలన్నారు.

టూటౌన్ ఎస్‌ఐ–2గా మానస



నల్లగొండ క్రైం : పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ–2గా మానస నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్పీ శరత్ చంద్రపవార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ కార్యాలయంలో ట్రిబుల్ సీఎస్‌లో పనిచేస్తున్న ఆమెకు ఎస్‌ఐ- 2గా పోస్టింగ్ ఇచ్చారు.

ఎస్‌ఐగా శోభన్‌బాబు బాధ్యతల స్వీకరణ



నాంపల్లి : మండల నూతన ఎస్‌ఐగా మొగుళ్ల శోభన్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. దేవరకొండ ఎస్‌హెచ్‌ఓ ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఆయన మండలానికి వచ్చారు. ప్రస్తుత మండల ఎస్‌ఐగా పనిచేసిన లచ్చిరెడ్డిని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

షూటింగ్ బాల్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్

నల్లగొండ రూరల్ : పట్టణ పరిధిలోని చర్లపల్లి సెయింట్ మేరీస్ స్కూల్‌కు చెందిన స్టైరిట్ అనే విద్యార్థిని జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చింది. ఏపీలోని ప్రకాశం జిల్లా చీరాలలో జరిగిన షూటింగ్ బాల్ జాతీయ స్థాయి బాలికల జూనియర్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి జట్టు తృతీయ స్థానంలో విజయం సాధించేందుకు కీలక పాత్ర పోషించింది. ఈ సందర్భంగా ఆ విద్యార్థినిని శనివారం పాఠశాల ప్రిన్సిపల్ బాలచంద్రావతి అభినందించారు.

యూనిఫాం పంపిణీ

మర్రిగూడ : మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫాంను మండల నోడల్ అధికారి బిట్టు శ్రీను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉడావత్ లచ్చిరాం, ఉపాధ్యాయులు కొండ శ్రీను, వలంటీర్ అమీనా తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్యశిబిరం

నకిరేకల్ : మండలంలోని మంగళపల్లి గ్రామంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరం శనివారం ఐదో రోజుకు చేరుకుంది. ఈ శిబిరంలో డాక్టర్ యోగస్వీని 23మందికి ఓపీ చూడగా ముగ్గురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించి మందులు పంపిణీ చేశారు. అదే విధంగా 15మందికి రక్త పరీక్షలు చేసి ఒకరికి చికెన్‌గున్యా ఉన్నట్లు నిర్ధారించారు. శిబిరాన్ని సందర్శించిన వారిలో హెచ్‌ఈఓ రాపోలు రవి, కార్యదర్శి రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

మునుగోడు : కేంద్రంలోఅధికారంలో ఉన్న బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. శనివారం మునుగోడులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాలకు సాగు నీరు అందించే డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎస్.రామలింగయ్య, జి.రామచంద్రం, టి.వెంకటేశ్వర్లు, శ్రీను, సతీష్, భిక్షంరెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ఆరీఫ్

నకిరేకల్ : విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని నకిరేకల్ మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫ్ అన్నారు. శనివారం పట్టణంలోని బాలికల జెడ్పీ హైస్కూల్‌లో మండల న్యాయసేవా సమితీ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ క్లబ్ సహకారంతో ర్యాంగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలన్నారు. తోటి విద్యార్థులతో స్నేహ పూర్వకంగా సోదరభావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బిచేపల్లి ప్రకాష్‌రావు, న్యాయవాదులు కొండ యాదగిరి, వెంకన్న, లయన్స్ క్లబ్ ప్రతినిధులు కందాల పాపిరెడ్డి, ఎన్.రాంమోహన్‌రావు, ఎర్ర శంభులింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ

పట్టణంలోని ప్రభుత్వ జెడ్పీ బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నోట్ పుస్తకాలు, పెన్నులను మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి షేక్ ఆరీఫ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బిచేపల్లి ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, న్యాయవాదులు కొండ యాదగిరి, వెంకన్న, లయన్స్ క్లబ్ ప్రతినిధుల సూర్యకుమార్, శివకోటి అంజనేయులు, ఎర్ర శంభులింగారెడ్డి, నవ్య క్లబ్ అధ్యక్షురాలు రమాదేవి, కార్యదర్శి పద్మజ, ట్రెజరరీ యల్లపురెడ్డి రఘునమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌ఐ

నాంపల్లి : మాదకద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్‌ఐ లచ్చిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పెద్దాపురం తెలంగాణ ఆదర్శ పాఠశాలలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డ్రగ్స్ నిర్మూలన కోసం పోలీసు యంత్రాంగం పనిచేస్తుందన్నారు. గంజాయి, మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన బాటాలో నడవాలని సూచించారు. మత్తు అనే లోకంలో తెలుతూ హత్యచారాలకు, దొంగతనాలకు, అమ్మాయిలపై వేధింపులకు పాల్పడి విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కవిత, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు మల్లం మహేష్, ఖమ్మంపాటి శంకర్, జిల్లా అధ్యక్షుడులు ఆకారపు నరేష్, భాస్కర్, పీఎస్‌ఎం జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు



హరీష్‌రావు ఫ్లెక్సీని దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

నల్లగొండ : పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు అన్నారు. అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డిపై హరీష్‌రావు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం పట్టణంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆయన ఫ్లెక్సీని దహనం చేశారు. హరీష్‌రావు మంత్రి కోమటిరెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కత్తుల కోటి, యూత్ కాంగ్రెస్ నాయకులు పాదం అనిల్, జహంగీర్‌బాబా, పి.నాగార్జున, బి.ప్రసాద్, ఎం.సాయిరాం, వంశీ, నందిని, రంజిత్, రాకేష్, సతీష్, టోనీ, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు



ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డు తనిఖీ చేస్తున్న ఏడీఏ ఎల్లయ్య

చండూరు(గట్టుప్పల్) : పత్తి, వరి పంటలకు సంబంధించి నకిలీ మందులు విక్రయిస్తే ఫర్టిలైజర్ దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా లైసెన్స్‌ను రద్దు చేస్తామని మునుగోడు ఏడీఏ ఎల్లయ్య హెచ్చరించారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో పత్తి, వరిలో దోమల నివారణకు పిచికారీ చేసే మందులు నకిలీవి విక్రయిస్తున్నారనే సమాచారంతో శనివారం ఫర్టిలైజర్ దుకాణాలను ఏడీఏ, ఏఓ వేర్వేరుగా ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి మందుల శాంపిల్స్‌ను సేకరించారు. అనంతరం ఏడీఏ మాట్లాడారు. యూరియా విక్రయాలకు పిచికారీ మందులు లింకు పెడితే సంహించేది లేదన్నారు. దుకాణాల్లో మందులు విక్రయిస్తే తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఆయన వెంట ఏఈఓ మౌనిక ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



రామగిరి(నల్లగొండ) : కేంద్రీయ విద్యాలయంలో మొక్కలతో విద్యార్థులు, తల్లులు

మర్రిగూడ : పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని నోడల్ అధికారి బిట్టు శ్రీను అన్నారు. శనివారం మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిక్ష సప్తహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిట్టు శ్రీను మాట్లాడారు. ప్రస్తుతం వాతావరణం కలుషితం అవుతుండడంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని, ఆరోగ్యాన్ని అందించేందుకు అందరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కొండ శ్రీను, వలంటీర్ అమీనా, విద్యార్థులు పాల్గొన్నారు.



మర్రిగూడ : పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి శ్రీను

కేవీఎస్‌లో మొక్కలు నాటిన విద్యార్థులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని కేవీఎస్ పాఠశాలలో శిక్షా సప్తహా కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఆదేశాల మేరకు వన్ ప్లాంట్ ఫర్ మదర్ అనే నినాదంతో 35మంది విద్యార్థులు వారి తల్లులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఏ.రవికుమార్, నెహ్రూ, ఆంటోనీ, విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బడ్జెట్‌తో దళితులకు ఒరిగేదేమీ లేదు

చండూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో దళిత బహుజనులకు ఒరిగేదేమీ లేదని, అది అంకెల గారడీతో కూడిన మాయా బడ్జెట్ అని బీజేపీ జిల్లా నాయకుడు అన్నెపర్తి యాదగిరి విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పోస్టర్ ఆవిష్కరణ

కనగల్ : మండలంలోని చిన్నమాదారం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల లేఖనా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఆగస్టు మొదటి వారంలో నిర్వహించే శిల్పశాల కార్యక్రమ పోస్టర్‌ను శనివారం పాఠశాల హెచ్‌ఎం వి.పద్మ, శిల్పశాల జిల్లా కన్వీనర్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పత్తిపాక గరిపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే కార్యశాలలో విద్యార్థులచే 'అవ్వ తాతలకు ఉత్తరాలు రాయండి' అనే శీర్షికన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్తమ ఉత్తరాలు రాసిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

కనగల్ : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఫౌండేషన్ చైర్మన్ కంబాల శివలీల మాట్లాడారు. కలాం ఒక భారతీయ అంతరిక్ష శాస్త్రవేత్త, రాజనీతిజ్ఞుడు అని కొనియాడారు.

దీక్షను జయప్రదం చేయాలి

నల్లగొండ టూటౌన్ : పెండింగ్‌లో ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద పెన్షనర్లు చేపట్టనున్న మౌనదీక్షను జయప్రదం చేయాలని ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ జిల్లా కన్వీనర్ పందిరి శ్యాంసుందర్ కోరారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జగదీష్‌చంద్ర, గోవర్ధన్, అబ్దుల్ ఖాదర్, విద్యాసాగర్‌రెడ్డి, వాణిశ్రీ, రమేష్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది వంశీధర్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలపై న్యాయవాదులంతా అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని హైకోర్టు న్యాయవాది వంశీధర్‌రెడ్డి, ఆంధ్ర మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.లక్ష్మి, కేశవ మెమోరియల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి అన్నారు. శనివారం పట్టణంలోని స్టే ఇన్ హోటల్‌లో న్యాయవాద పరిషత్ నల్లగొండ శాఖ ఆధ్వర్యంలో నూతన చట్టాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో వారు పాల్గొని మాట్లాడారు. బ్రిటిష్ కాలం నుంచి అమలులో ఉన్న కొన్ని చట్టాలను మారుస్తూ నూతన న్యాయ సంహిత గురించి న్యాయవాదులు అటు ప్రజలు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐపీసీ ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లలో తీసుకువచ్చిన మార్పులను కచ్చితంగా తెలుసుకోవాలిన్న అవసరాన్ని ఆవశ్యకతను వివరించారు. నూతన న్యాయచట్టాలపై పలువురు న్యాయవాదులు అడిగిన సందేహాలను వారు సమాధానాలు ఇచ్చారు. నూతన న్యాయ చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా భవిష్యత్‌లో భారత శిక్షాస్మృతి నూతన విధానాల పట్ల స్పష్టమైన అవగాహన ఏర్పడడం ద్వారా న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో న్యాయవాద పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సోమసాని సునీల్, కోశాధికారి మంగులాల్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ మేరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చుక్కల్ల నాగరాజు, కట్ట సూర్యసంపత్ పాల్గొనగా అతిథులుగా అక్కినపల్లి మురళీధర్‌రావు, నన్నూరి రామ్‌రెడ్డి, కాంపాటి యాదగిరి, నూకల నరసింహారెడ్డి, నేతి రఘుపతి, గార్లపాటి వెంకటయ్య, కే శ్రీనివాస్‌రెడ్డి, పల్లెబోయిన శ్యాంసుందర్, రాంప్రసాద్ అంజిరెడ్డి, హరిరామ్, ఎంవీ రమేష్ రాథోడ్, సుమశ్రీ,, సంధ్యారాణి, ప్రమీల, భాగ్య, ఫాతిమ, జె.భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శివరాంరెడ్డి, పక్కన సీఐ, ఎస్‌ఐలు



సదస్సులో పాల్గొన్న కౌన్సిలర్లు, నాయకులు

నల్లగొండ క్రైం : పట్టణంలోని ప్రతికాలనీలో నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో పలువురు కౌన్సిలర్లు, ఇతర నాయకులు, వ్యాపారులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణ, ఆకతాయిల వేధింపులు, గంజాయి, మద్యంతాగి కాలనీల్లో అసభ్యకరంగా ప్రవర్తించే, బైక్ రైడింగ్‌లు చేసేవారిని కట్టడి చేసేందుకు ఉపయోగపడతాయన్నారు. అన్ని కాలనీల్లో ప్రధాన రహదారుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో సీఐ డానియెల్, రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐలు, పలువురు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని నూకలవారిగూడెంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామంలో ఇంటికి ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. డెంగీతో పాటు టైఫాయిడ్, చికెన్‌గున్యా జ్వరంతో బాధపడుతూ వచ్చే వారితో పీహెచ్‌సీ కిక్కిరిసిపోతుంది. ఆస్పత్రిలో సరిపడా వసతులు లేక పేషెంట్లు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రామగిరి(నల్లగొండ) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను తిప్పర్తి పోలీసులు శనివారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడుగులపల్లి మండలం కల్వలపల్లి గ్రామానికి చెందిన చిట్యాల వినోద్ బొమ్మకల్లు వాగు నుంచి అనుమతి లేకుండా తిప్పర్తికి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా నూకలవారిగూడెం వద్ద ఎస్‌ఐ డి.రాజు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వినోద్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వాటర్ క్యాన్ల అందజేత



వాటర్ క్యాన్‌లను అందజేస్తున్న శేపూరి రవీందర్

చిట్యాల : మున్సిపాలిటీ పరిధిలోని 2వవార్డులో శనివారం మొదటి వార్డు కౌన్సిలర్, మాజీ జెడ్పీటీసీ శేపూరి రవీందర్ ఇంటింటికీ మంచినీటి క్యాన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని 12వార్డుల్లో మంచినీటి క్యాన్‌లను ఉచితంగా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, బీఆర్‌ఎస్ రెండో వార్డు ఇన్‌చార్జ్ కోనేటి ఎల్లయ్య, ఆగు అశోక్, ఇరగదిండ్ల గణేష్, రావుల వెంకన్న, మందడి జనార్దన్‌రెడ్డి, కంభంపాటి నర్సింహ, లతీఫ్, కోనేటి సాయిరాం, గోగికారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చండూరు : సంక్షేమ వసతిగృహాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొట్టు శివకుమార్ అన్నారు. శనివారం గట్టుప్పల్ మండల కేంద్రంలో ఎస్టీ బాలుర హాస్టల్‌ను సంఘం ఆధ్వర్యంలో ఆయన సందర్శించి మాట్లాడారు. వసతి గృహంలో మరుగుదొడ్లు, స్నానపు గదులు, తరగతి గదులు శిథిలావస్థకు చేరాయని లైట్లు, ఫ్యాన్లు, కిటికీలు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. ఆయన వెంట సంఘం నాయకులు ఖమ్మం రాములు, చారి, దుబ్బాక యాదయ్య, నరసింహ, సైదులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ వసతిగృహాన్ని పరిశీలిస్తున్న నాయకులు

డీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన

నల్లగొండ : తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి కేవలం 7.3శాతం బడ్జెట్ కేటాయించటాన్ని నిరసిస్తూ పట్టణంలోని గడియారం సెంటర్‌లో శనివారం డీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ అధ్యక్షుడు ఎం.సోమయ్య మాట్లాడుతూ.. కనీసం 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.విజయ్‌కుమార్, రత్నయ్య, ఖుర్షిద్‌మియా, ఏడుకొండలు, కాశయ్య, లక్ష్మయ్య ఉన్నారు.

బడ్జెట్ ప్రతుల దహనం

నకిరేకల్ : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని కోరుతూ శనివారం పట్టణంలోఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ కార్యదర్శి ముస్కు రవీందర్ మాట్లాడుతూ.. విద్యారంగానికి కేవలం 7.30శాతం నిధులు కేటాయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నవీన్, వినయ్, గోపి, మహేష్, స్వప్న, శృతి, రేణుక, మనీషా తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు సన్మానం



శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సన్మానంలో పాల్గొన్న డ్రైవర్లు, జవాన్‌లు

నల్లగొండ టూటౌన్ : స్థానిక మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తూ బదిలీ అయిన మూర్తుజాఅలీ, సురిగి శంకర్‌ను శనివారం మున్సిపల్ వాహనాల డ్రైవర్లు, జవాన్‌లు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గద్దం శ్రీనివాస్, నాగరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గ్రీన్ డే



నకిరేకల్ పట్టణంలోని మాస్టర్‌మైండ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం చిన్నారులు నిర్వహించిన గ్రీన్ డే ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చిన్నారులు ఆకుపచ్చని దుస్తులు ధరించి పచ్చని చెట్లతో ప్రదర్శన చేశారు.

– నకిరేకల్